
**జగదేక సుందరి, చదువుల సరస్వతిలాంటి సుజాతకి ఇరవై ఏళ్ళు.**



ఆరోజు సుజాతకి పెళ్ళిచూపులు. ఇంట్లో అంతా హడావిడి. తెలియని చెరుకు, ఆందోళన, ఆనందాలతో సుజాత సిగ్గుల మొగ్గయి పోతోంది. కారణం ఆమెకి ఇదే మొదటి పెళ్ళిచూపులు!

"ఏ చీరకట్టు కుంటే బావుంటుంది? పోనీ లంగా ఓణీ వేసుకుంటే? ఊఁహుఁ!

# ఆడపిల్ల పెళ్ళి

— నందం రామారావు

"చీరే బావుంటుంది...." ఇలా ఆలోచిస్తూ అద్దం ముందుకూర్చుని హడావిడి పడిపోతోంది.

పెళ్ళివారు వచ్చారు.

పలకరింపులు, ఆహ్వానించడాలూ అయ్యాయి. వాళ్ళు వచ్చారని తెలియగానే సుజాత గుండె రెట్టింపు వేగంతో కొట్టుకుంది.

ఆశీనులైన పెళ్ళివారి మాటలు ఆమెకి స్పష్టంగా వినిపిస్తూనే ఉన్నాయి. కారణం అదేం పెద్ద బంగళా కాదు. రెండు గదుల పాత పెంకుటిల్లు!

ఫలహారాలూ వగైరాలు పూర్తికాగానే తల్లి సుజాత దగ్గరికొచ్చింది. కుందనపు బొమ్మలా ఉన్న కూతుర్ని చూసి మురిసిపోయింది.

"పద! వాళ్ళు రమ్మంటున్నారు" అంటూ కూతురి చెయ్యి పట్టుకొని పెళ్ళివారున్న గదిలోకి తీసుకొచ్చి కూర్చోపెట్టింది. సుజాత పెదవులు ఒణుకుతున్నాయి. చూపులు, నేలని తప్ప పరిసరాలని చూడనంటున్నాయి.

పరిచయ వాక్యాలూ, నమస్కార, ప్రతి నమస్కారాలూ అయ్యాయి. సుజాత రాకతో కాస్సేపు నిశ్శబ్దంగా ఉండి, మళ్ళీ కబుర్లలోకి దిగారు మగాళ్ళు.

వరుడు సుబ్బారావు ఓరగా చూశాడు సుజాతకేసి. దివి నుంచి భువికి దిగి వచ్చిన దేవకన్యలా కనిపించిందామె అతని కళ్ళకి.

"చిన్నపిల్ల! ఈడూ జోడూ బావుంటుంది" అనుకుంది. వరుడి తల్లి.

"అమ్మాయి చాలా బావుంది" అనుకున్నారు ఆడబడుచులు. "గుణవంతురాల్లా గానే ఉంది" తృప్తిగా అనుకున్నాడు వరుడి తండ్రి.

"ఈ అమ్మాయి నాకు నచ్చింది" సినీ హీరోలా అక్కడే చెప్పేశాడు వరుడు.


టోటల్గా సుజాత అందరికీ నచ్చింది.

"మిగతా విషయాలు" భర్తకేసి చూస్తూ గొణికింది వరుడి తల్లి.

"బ్యాంక్లో పనిచేసే మావాడికి రెండు లక్షలిస్తామని వస్తున్నారు. కానీ మీ అమ్మాయి బావుంటుందనీ, మీ సాంప్రదాయం మంచిదనీ వచ్చాం. అందుకే ఓ లకారం మాత్రం ఇవ్వండి" అన్నాడు వరుడి తండ్రి.

లకారం అంటే ఓ వంద అన్నంత తేలిగ్గా.

సుజాత తండ్రి గుండెల్లో ఆటంబాంబే మోగినట్టయింది. రేపోమాపో రిటయిరవబోతున్న కుచేల సంతానం ఉన్న అతగాడికి ఆమాట బాంబే మరి! అతను లకారం మాట అటుంచి ఓ పదివేలు కూడా ఇచ్చుకో




లేడు.

అంతే! ఆ సంబంధం కేన్సిల్ అయిపోయింది. కృంగిపోయారు సుజాత తల్లిదండ్రులు. సుజాత మొహం వెలవెలబోయింది.

తర్వాత మరోటి. ఆ తర్వాత ఇంకోటి. ఇలా చాలా సంబంధాలు చూడ్డం, కొన్ని వీళ్ళకి నచ్చక, కొన్ని వాళ్ళకి నచ్చక కేన్సిల్ అయిపోవడం మామూలయిపోయింది.

కాలగర్భంలో పదేళ్ళు కలిసిపోయాయి. ఈ పదేళ్ళలో సుజాత పెళ్ళి కాలేదు గానీ, ఆమె పెద్ద కంపెనీలో పెద్ద ఆఫీసర్గా పనిచేస్తోంది. అంతేకాదు, ఇద్దరు చెల్లెళ్ళకి, ఓ తమ్ముడికి చదువు చెప్పించి పెళ్ళిళ్ళు చేసింది.

ఇప్పుడామె ఉండే ఇల్లు రెండు గదుల పాత పెంకుటిల్లు కాదు. కంపెనీ వాళ్ళిచ్చిన బంగళా! ఖరీదైన ఫర్నీచర్, కారు, ఫోను వగైరాలన్నీ ఉన్నాయి.

అందరూ హేపీగా బతికేస్తున్నారు. అయితే ఒక్కరూ సుజాత పెళ్ళి విషయం పట్టించుకోవడం లేదు. ఎరుగున్న వాళ్ళెవరైనా సుజాతకి సంబంధాలు చెప్తే-

"ఇంత అందాలరాశికి, ఇంత పెద్ద ఆఫీసర్కి ఈ దరిద్రపు సంబంధమా?" అని తిప్పి పంపేస్తున్నారు ఆ ఇంట్లోనివారు.

ఒకటి రెండు సంబంధాలు చూపుల దాకా వచ్చినా, కనీసం సుజాత నడక్కుండానే వంకలు పెట్టి పంపేస్తున్నారు.

ఇదంతా చూస్తుంటే సుజాత గుండె నీరైపోతోంది. "తన వాళ్ళు ఇంత అవకాశవాదులా?" అనుకుంది విస్మయంగా. ఇంట్లోవారి ప్రవర్తన ఆమె గమనిస్తూనే ఉంది.

వీళ్ళంతా ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో ఆమెకి బాగా తెలుసు. పెళ్ళికి ఇంకో చెల్లెలుంది. చదువుకుంటున్న తమ్ముడున్నాడు. ఉద్యోగంలేని అన్న అన్న కుటుంబం ఉంది. వీళ్ళంతా హాయిగా బతకడానికి తనుంది.

అలాంటప్పుడు తాను పెళ్ళి చేసుకుంటే వీళ్ళంతా ఏమౌతారు? వచ్చిన వ్యక్తి వాళ్ళని ఉండనిస్తాడన్న నమ్మకం ఏవిటి? అందుకే ఇంత మంది కోసం తనొక్కతే బాధపడ్డా, యంత్రంలా మారినా వాళ్ళకేం బాధలేదు..

ఇలా అనుకుంటే సుజాత గుండె నీరయి పోతోంది. దీనికన్నా మరో ఘోరం పని ఏంటే.

ఎవరైనా ఆమె పెళ్ళిని గురించి అడిగితే- "ప్చ్! నలభై ఏళ్ళు దాటబోతున్నాయి. ఇంకా ఏంపెళ్ళి?" అని అన్నావదినలు,

"ప్చ్! నలభైయ్యో పడిలో పడ్డసుజీని ఎవరు చేసుకుంటారు?" అని రాని కళ్ళొత్తుకుంటుందామె తల్లి.

"ప్చ్! భగవంతుడు దాని మొహాన కళ్యాణగీత రాయలేదు" భారంగా అంటాడు తండ్రి.

"ఏఈడు కావొచ్చట! ఇప్పుడింకా పెళ్ళేవిటి. కావాలంటే నా కొడుకుని పెంపిస్తాన్లేవే" అంటుంది. రెండో పురిటికి వచ్చిన పెద్ద చెల్లెలు.

నిజానికి సుజాత కిప్పుడు ముప్పయ్యేళ్ళు! కానీ తండ్రి మాత్రం నలభైఏళ్ళు అంటాడు. తల్లీ అదే అంటుంది. అన్నా వదినెలూ అదే అంటారు. ఒక్క సుజాత తప్ప అందరూ సుజాతకి నలభై ఏళ్ళనే చెప్తారు. దాన్ని ఖండించాలని ఉన్నా ఎందుకో సుజాత ఖండించదు.

చాలా రోజుల తర్వాత మళ్ళీ ఆరోజు సుజాతకి పెళ్ళి చూపులు. వరుడు బ్యాంకు ఆఫీసర్. ధనవంతుడు.

బిత్తరపోయారంతా.

కారణం ఆ సంబంధం ఎవరు చెప్పారో గానీ ఇంట్లో మాత్రం సుజాతే చెప్పింది.

"హవ్వ! తన పెళ్ళి సంబంధం తానే చూసుకుందా?" ఉద్యోగం పూడిన భర్తతో సహా అక్కడే ఉంటున్న చిన్న చెల్లెలు గుండెలు బాదకుంది. అయినా ఎవరికీ ఈ పెళ్ళి చూపుల్ని ఒద్దనే ధైర్యం లేదు.

పెళ్ళి చూపులయ్యాయి. వధూవరులు సిగ్గు పడకుండా మాట్లాడుకున్నారు.

ఇదంతా చూస్తుంటే "ఇది కుదిరిపోతుందేమో" అని అందరి గుండెల్లోనూ రాయి పడింది.

"బాబూ! నీకెన్నేళ్ళు" అంది సుజాత తల్లి వరుణ్ణి ఉద్దేశించి, ఏదైనా అడ్డుపుల్ల వేయడానిక్కుదురుతుందా?" అని

"ముప్పయ్యయిదేళ్ళండీ" వినయంగా అన్నాడతను.

కెవ్వుమన్నంత పనిచేసి-

"మామ్మాయికి నలభై ఏళ్ళు నాయనా! నీకన్నా పెద్దదాన్ని చేసుకుంటే ఆయుక్షీణం" అంది సుజాత తల్లి.

"అవును బాబూ ఈ పెళ్ళి వరహీనంగా ఉంటుంది" అన్నాడు తండ్రి. ఒక్కసుజాత తప్ప అందరూ ఏకగ్రీవంగా అదే మాటన్నారు.

అతను సన్నగా నవ్వాడు.

సుజాత నవ్వింది. పెద్దగా నవ్వింది. పడీపడీ నవ్వింది. ఆయాసం వచ్చే దాకా కళ్ళ నీళ్ళు వూరే దాకా నవ్వింది.

"ఏవిటా నవ్వు! పిచ్చెక్కిందా?" అరిచింది సుజాత తల్లి. సుజాత నవ్వు నాపుకుని మౌనంగా కూర్చుంది. వరుడికేసి చూస్తూ.

"చూడండి! సరిగ్గా పదేళ్ళ క్రితం మీ సుజాతని చూడ్డానికి నేనూ మావాళ్ళూ కలిసి వచ్చాం. అప్పుడు మీరు చెప్పారు. సుజాతకి ఇరవైయ్యేళ్ళు అని, అది నిజం అని కూడా నాకు తెలుసు. గుర్తు రాలేదా! నాపేరు సుబ్బారావు. నాకు, మీ అమ్మాయికి కూడా అవి మొదటి పెళ్ళి చూపులే.

నిజానికి సుజాత నాకెంతో నచ్చింది. కానీ మావాళ్ళు కట్నం తక్కువైందని ఒదిలేసారీ సంబంధం. మా వాళ్ళతో పోట్లాడే, ఫలితం లేక ఆరోజు నించీ ఈ రోజు దాకా నేను మరో అమ్మాయిని చూళ్ళేదు. కానీ సుజాతని గురించి తెలుసుకుంటూనే ఉన్నాను. మీరు ప్రవర్తిస్తున్న తీరు తెలుసు. ఎంత స్వార్థపరులైనా కూతురి భవిష్యత్తుని, ఆమె జీవితాన్ని తమ స్వార్థం కోసం పణంగా పెడతారని నేను ఊహించలేదు. కానీ ఇప్పుడు కళ్ళారా చూస్తున్నాను.

మీ సుజాత నేనూ కావాలనే ఈ చూపుల ఏర్పాటు చేశాం. మీ స్వార్థం కూడా చూశాం. క్షమించండి. ఈసారి మీరు ఓడిపోయారు. ఎందుకంటే మేం రేపే రిజిస్టర్ మేరేజ్ చేసుకోబోతున్నాం. ఈ ఇంట్లోనే. అందరికీ మంచి పార్టీ ఇవ్వబోతున్నాం! ఇప్పుడు చెప్పండి మీ సుజాతకి ఎన్నేళ్ళు?" అన్నాడు తన మంత్రదండంతో జనాన్ని శిలల్లా చేసినట్టు అంత ప్రతిమల్లానిల్చుండిపోయారు.